## కపిల్ శర్మ, హుమాఖురేషీకి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: బెట్టింగ్ యాప్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరికొంత మంది బాలీవుడ్ నటులకు నోటీసులు జారీ చేసింది. మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణపై బాలీవుడ్ కమెడియన్ కపిల్ శర్మ, నటులు హుమా ఖురేషి, హీనా ఖాన్‌లకు ఈడీ నోటీసులు జారీ చేసింది. రాయ్‌పూర్‌లోని తమ కార్యాలయం ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. కాగా, ఇదే కేసులో ఇప్పటికే రణబీర్ కపూర్‌కు ఈడీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## జ్ఞానవాపీ శాస్త్రీయ సర్వే గడువు పొడిగింపు


వారణాసి (యూపీ), అక్టోబర్ 5: జ్ఞానవాపీ మసీదు శాస్త్రీయ సర్వే గడువును మరో నాలుగు వారాలు పొడిగిస్తున్నట్టు వారణాసిలోని ఓ కోర్టు తెలిపింది. ఇక ఇంతకు మించి గడువును పెంచలేమని వెల్లడించింది. వాస్తవానికి పురావస్తు శాఖ ఈ నెల 6న నివేదికను సమర్పించాలి. అయితే గడువును పొడించాలన్న విజ్ఞప్తిపై కోర్టు సానుకూలంగా స్పందించింది. మరో నాలుగు వారాల్లోగా సర్వే పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సూచించింది.


## వేర్పాటువాది షాబిర్ షా పార్టీపై ఐదేండ్ల నిషేధం

న్యూఢిల్లీ: వేర్పాటువాది షాబిర్ అహ్మద్ షా నేతృత్వంలోని జమ్ముకశ్మీరు ప్రజాస్వామిక స్వతంత్ర పార్టీపై కేంద్ర ప్రభుత్వం ఐదేళ్లపాటు నిషేధం విధించింది. ఈ పార్టీ భారత వ్యతిరేక, పాకిస్థాన్ అనుకూల కార్యకలాపాలకు పాల్పడుతున్నదని గురువారం జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం ఈ ఆదేశాలిచ్చింది. ఈ పార్టీని షా 1998లో ఏర్పాటు చేశారు. వేర్పాటువాదుల కూటమి హురియత్ కాన్ఫరెన్స్‌లో ఈ పార్టీ భాగస్వామి. ఆయన మనీలాండరింగ్ కేసులో అరెస్టయి, ప్రస్తుతం ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు.

# బీజేపీకి ఓటమి భయం!

- దేశవ్యాప్తంగా కమలం పార్టీపై వ్యతిరేకత
- ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటమి తథ్యమనే భయం
- నష్ట నివారణ చర్యలకు దిగిన కమలనాథులు
- ఛత్తీస్‌గఢ్ నేతలతో అమిత్ షా రహస్య చర్చలు
- కదన రంగంలోకి దిగాలని పార్టీ శ్రేణులకు నిర్దేశం
- కులాల వారీగా సమావేశాలు, విందులకు ఆదేశం
- ఆయా వర్గాల కోరిక మేరకు మోదీ వరాలు?





*(స్పెషల్ టాస్క్ బ్యూరో)*

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా బీజేపీ గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నది. ఇటు ప్రజల నుంచి అటు సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దీంతో రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటమి తథ్యమని ముందే తెలుసుకున్న ఆ పార్టీ నష్ట నివారణ చర్యలకు దిగింది. ఈ ఎన్నికల్లో ఓటమి ఎదురైతే సార్వత్రిక ఎన్నికల్లోనూ ప్రతికూల ఫలితాలు వస్తాయని భావించిన బీజేపీ ఐదు రాష్ట్రాల ఎన్నికలను ప్రతిష్ఠాత్మంగా తీసుకుంది. తెలంగాణలో బీఆర్ఎస్‌దే గెలుపని పలు సర్వేలు.. సెఫాలజిస్టులు ఇప్పటికే తేల్చిచెప్పడంతో మిగతా రాష్ట్రాలపై ఆ పార్టీ దృష్టి సారించింది. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో అధికార పీఠాన్ని కాపాడుకుంటూనే.. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో తిరిగి అధికారాన్ని చేపట్టేందుకు కమలం పార్టీ పడరాని పాట్లు పడుతున్నది. ఆయా రాష్ట్రాల్లో బీజేపీకి ప్రతికూలంగా సర్వే ఫలితాలు వస్తున్నా.. తిమ్మిని బమ్మిని చేసి ఎలాగైనా గెలవాలని వ్యూహాలు రచిస్తున్నది. ఇటీవల కర్ణాటకలో ఆ పార్టీ ఘోరంగా ఓడిపోవడంతో ఏకంగా బీజేపీ అగ్రనేత అమిత్ షా రంగంలోకి దిగారు. అందులో భాగంగానే రాయపూర్‌లో పార్టీ ముఖ్యులు, సంఘ్ పరివార్ నేతలతో ఆయన రహస్యంగా సమావేశమయ్యారని తెలిసింది.

**ఏం ఆశిస్తున్నారో తెలుసుకోండి...**

ఈ సమావేశంలో పార్టీ నేతలకు అమిత్ షా దిశానిర్దేశం చేశారు. కులాల వారీగా సమావేశాలు, విందులు ఏర్పాటు చేసి ఆయా వర్గాలు ఏం ఆశిస్తున్నాయో తెలుసుకోవాలని ఆదేశించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆయా వర్గాలు ఆశించిన మేరకు త్వరలో జరగబోయే బహిరంగ సభల్లో ప్రధాని మోదీ వరాల జల్లు కురిపిస్తారని ఆయన చెప్పినట్టు తెలుస్తున్నది.

**మెజారిటీ రాకపోయినా..**

పరివర్తన్ సభలపై అసంతృప్తి వ్యక్తం చేసిన అమిత్ షా.. ఛత్తీస్‌గఢ్ ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలను స్వయంగా తానే తీసుకుంటానని నేతలతో చెప్పినట్టు తెలుస్తున్నది. రైతుల సమస్యలకు మేనిఫెస్టోలో ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మరోవైపు సంఘ్ పరివార్, బీజేపీ నేతల మధ్య సమన్వయం గురించి కూడా చర్చకు వచ్చినట్టు తెలుస్తున్నది. కాగా, పూర్తిస్థాయి మెజారిటీ రాకపోతే ఎలాంటి వ్యూహం రచించాలనే అంశం కూడా చర్చించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## ఏడడుగులు వేయకుంటే హిందూ వివాహం చెల్లదు

### అలహాబాద్ హైకోర్టు తీర్పు

అలహాబాద్: ఏడడుగులు, ఇతర సంప్రదాయ తంతు నిర్వహించకుండా జరిగే హిందూ వివాహం చెల్లుబాటు కాబోదని అలహాబాద్ హైకోర్టు పేర్కొన్నది. తనకు విడాకులు ఇవ్వకుండా తనను వదిలేసి తన భార్య ఇంకో వివాహం చేసుకుందని ఒక వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. వధువు, వరుడు కలిసి నడిచే సప్తపది అన్నది హిందూ చట్టంలో అత్యంత ముఖ్యమైన తంతు. అయితే ఫిర్యాదుదారు ఆరోపించినట్టుగా అలాంటిది జరిగినట్టు కన్పించడం లేదని కేసును విచారించిన జస్టిస్ సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేసు వివరాల్లోకి వెళితే స్మృతి సింగ్‌కు సత్యం సింగ్‌తో 2017లో పెండ్లి జరిగింది. అయితే భర్త వేధింపులతో ఇల్లు విడిచి వెళ్లిన స్మృతి అతనిపై కట్నం కోసం వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. విచారణ చేసిన పోలీసులు భర్త సత్యం సింగ్, అత్తమామలపై కేసు నమోదు చేశారు. అయితే తన భార్య రెండో పెండ్లి చేసుకుందని, అందుకే ఇలా కేసు పెట్టిందని భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు జరిపి అది అబద్ధమని నిర్ధారించారు.

## మహారాష్ట్రలో మరణ మృదంగం

### నాందేడ్‌లో మరో 14 మంది మృతి • ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

ముంబై, అక్టోబర్5 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ప్రభుత్వ దవాఖానాల్లో మృత్యుతాండవం కొనసాగుతున్నది. నాందేడ్ ప్రభుత్వ దవాఖానలో గురువారం మరో 14 మంది మరణించారు. నాసిక్ ప్రభుత్వ దవాఖానలో ఇద్దరు నవజాత శిశువులు మరణించారు. రూ.45 వేల మందులు బయట నుంచి కొనుగోలు చేసి ఇచ్చామని, రక్త, మూత్ర పరీక్షలతోపాటు ఇతర పరీక్షల కోసం రూ.10 వేల కంటే ఎక్కువ ఖర్చు చేసినా తల్లి బిడ్డ ఇద్దరూ మృతి చెందారని మృతురాలి బంధువులు ఆరోపించారు. తనతో మరుగు దొడ్లు కడిగించిన ఎంపీ హేమంత్ పాటిల్‌పై దవాఖాన సూపరింటెండెంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరణాల నివారణకు చేపట్టిన చర్యలు, రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలపై నివేదిక ఇవ్వాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ మహారాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.



## కెన్యాలో అంతుచిక్కని వ్యాధి

న్యూఢిల్లీ: కెన్యాలోని సెయింట్ థెరీసాలో ఉన్న ఓ హైస్కూలులో చదువుతున్న బాలికలు విచిత్ర వ్యాధితో బాధపడుతున్నారు. దాదాపు 95 మంది బాలికల కాళ్లకు పక్షవాతం వంటి వ్యాధి సోకింది. దీంతో వారు సరిగ్గా నడవలేకపోతున్నారు. ఈ వింత వ్యాధికి కారణాలేమిటో తెలుసుకునేందుకు కెన్యా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. బాధితుల రక్త నమూనాలను కెన్యా మెడికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించారు. మెరుగైన చికిత్స అందించేందుకు బాధితులను దవాఖానలకు తరలించారు.



## బెంగళూరులో 190 కిలోమీటర్ల టన్నెల్

బెంగళూరు: బెంగళూరు పేరెత్తగానే అందరికీ గుర్తుకు వచ్చేది ట్రాఫిక్ వెతలు. గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి నగరవాసులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు ఆ ట్రాఫిక్ సమస్య నుంచి నగర ప్రజలకు విముక్తి కల్పించడానికి 190 కిలోమీటర్ల పొడవైన టన్నెల్ (సొరంగ) రహదారిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. దీని ద్వారా నగర వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి 45 రోజుల్లో టెండర్లను ఆహ్వానించనున్నట్టు వెల్లడించారు.



## రష్యా దాడుల్లో 50 మంది దుర్మరణం

కీవ్: తమ దేశంపై గురువారం రష్యా చేసిన రాకెట్ దాడిలో 50 మంది పౌరులు దుర్మరణం చెందారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. హ్రోజా గ్రామంలో ఓ దుకాణం, కేఫ్‌పై రష్యా దాడి చేసినట్టు వెల్లడించారు. ఈ దాడిని ఉద్దేశపూర్వక ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలవాలని ఆయన గురువారం స్పెయిన్‌లో జరిగిన యూరోపియన్ నేతల సమావేశంలో పశ్చిమ దేశాలను కోరారు. దీనిపై ఆగ్రహంతోనే రష్యా రాకెట్ దాడికి పాల్పడిందని భావిస్తున్నారు.



## పాలు, పాల ఉత్పత్తుల్లో ప్రొటీన్ బైండర్స్ వాడొద్దు

న్యూఢిల్లీ, అక్టోబర్ 5: పాలు, పాల ఉత్పత్తుల తయారీలో ప్రొటీన్ బైండర్స్ వాడకానికి అనుమతి లేదని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తెలిపింది. కొత్త ఆహార ఉత్పత్తులు, మరీ ముఖ్యంగా సెమీ-సాలిడ్ లేదా సాలిడ్ ఫుడ్స్ తయారీకి ఈ బైండింగ్ ఏజెంట్లు అవసరంగా మారాయని, ప్రొటీన్ బైండర్ జీర్ణం కావడం కష్టమవుతుందని పేర్కొన్నది. పాలలోని ప్రొటీన్ల జీవ సంబంధ, పోషక విలువలపై ప్రొటీన్ బైండర్స్ ప్రభావం చూపుతాయని తెలిపింది.

